Impact Factor (SJIF): 6.126 E-ISSN: 2583-1615

International Journal of Research in Academic World

Received: 09/March/2025 IJRAW: 2025; 4(4):163-165 Accepted: 16/April/2025

# తెలుగులో చంపూ కావ్యము-పరిశీలన

*[1]డాక్టర్ పసుపులేటి నాగమల్లిక

*[1]తెలుగు అధ్యాపకురాలు, ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల, కాకినాడ, ஆந்திரப் பிரதேசம், இந்தியா.

**సారాంశం**

సమాజానికి మేలు చేకూర్చేది సాహిత్యం.అలాంటి సాహిత్యంలో భాగంగా కావ్యం, కథ, శతకం, నవల, నాటకం, వ్యాసం మొదలైన ప్రక్రియలెన్నో పుట్టుకొచ్చాయి.

భారతీయాలంకారికులు ఛందస్సును ప్రమాణంగా స్వీకరించి, కావ్యాన్ని పద్య, గద్య, చంపూ కావ్యాలని మూడు రకాలుగా విభజించారు.చంపూ కావ్యం

అనగా పద్యగద్య సమ్మిళితం.

అంటే పద్యం, గద్యం రెండూ కలిసి ఉంటాయి. దీనినే గద్యపద్యోభయ కావ్యం అంటారు.ఉదాహరణగా కవిత్రయ ఆంధ్ర మహాభారతంలో కొన్ని గద్య పద్యాలను పరిశీలిద్దాం.

సభాపర్వంలో ద్రౌపదీ వస్త్రాపహరణ సందర్భంలో దుశ్శాసనుని పై భీముడు కోపోద్రిక్తు డయ్యాడు. ఆ కోపాన్ని నన్నయ ఈ పద్యంలో చూపాడు.

"కురువృద్ధుల్ గురువృద్ధబాంధవులనేకుల్ సూచుచుండన్ మదో...."

ఉదాహరణకి విరాటపర్వంలో పాండవులు ద్రౌపది విరాటని కొలువులో ఏ విధంగా మసులుకోవాలో వాళ్ళ పురోహితుడైన ధౌమ్యుడు చెప్పే సందర్భంలోనివి ఈ క్రింది తిక్కన్నకిష్టమైన వచన రచన:

"వ. కావున మీకు నప్రమాదార్థంబుగా నానేర్చినవిధంబున నుపదేశం"

ఈ విధంగా కవిత్రయ మహాభారతమే కాకుండా చంపూ కావ్య పద్ధతికి మొల్ల రామాయణంలోని పద్య, గద్యాలను పరిశీలిద్దాం.

సీతాదేవి అశోకవనంలో ఉండగా అక్కడ ఆమెకు కాపలాగా ఉన్న త్రిజట అనే రాక్షస స్త్రీ ఒక కలగంటుంది. ఆ సన్నివేశాన్ని ఈ క్రింది పద్యం ద్వారా వివరిస్తుంది.

"మ.

కలగంటిన్ వినుఁ డింతులార మనలంకాద్వీప మీయబ్ధిలో పల వ్రాలన్.."

ఆ సందర్భంలోనే ఒక వచనం ద్వారా అక్కడ పరిస్థితిని వివరిస్తుంది.

"వ. అప్పుడు యామినీచరకామినులు రావణానుమతంబున..."

ఈ విధంగా ప్రాచీన తెలుగు సాహిత్యంలో దాదాపుగా ఎక్కువ చంపుకావ్యాలే కనిపిస్తాయి.

**కీలక పదం**: 'పద్యం చతుష్పదమ్', అపాద: పద సంఘాత: గద్యం', గద్యపద్యోభయ కావ్యం, గద్యం కవీనాం నికషం వదంతి", వృత్తగంధి.

## ముందుమాట

"సహితస్యభావః సాహిత్యమ్", "హితేన సహితం సాహిత్యం" అంటే హితముతో కూడినది, హితాన్ని చేకూర్చేది అని సాహిత్యానికి నిర్వచనాలు. అనగా సమాజానికి మేలు చేకూర్చేది సాహిత్యం అని అర్థం. అలాంటి సాహిత్యంలో భాగంగా కావ్యం, కథ, శతకం, నవల, నాటకం, వ్యాసం మొదలైన ప్రక్రియలెన్నో పుట్టుకొచ్చాయి.

ముఖ్యంగా ప్రాచీన సాహిత్యంలో భాగమైన కావ్యాన్ని మన ఆలంకారికులు, పాశ్చాత్య విమర్శకులు అనేక విధాలుగా వర్గీకరించారు.

భారతీయాలంకారికులు ఛందస్సును ప్రమాణంగా స్వీకరించి, కావ్యాన్ని పద్య, గద్య, చంపూ కావ్యాలని మూడు రకాలుగా విభజించారు. ప్రదర్శన ప్రమాణాన్ని అనుసరించి దృశ్య, శ్రవ్యకావ్యాలుగా విభజించారు. ఇందులోని మొదటి విభాగం స్వరూపాన్ని బట్టి, రెండోది స్వభావాన్ని బట్టి చేయబడ్డాయి.

*Corresponding Author: డాక్టర్ పసుపులేటి నాగమల్లిక

ఇంకా వస్తువును బట్టి ప్రఖ్యాతం, ఉత్పాద్యం, మిశ్రమం అని కావ్యం మూడు విధాలు. అర్థాన్ని బట్టి ధ్వని, గుణీభూత వ్యంగ్య కావ్యం, చిత్ర కావ్యం అని మళ్ళీ మూడు విధాలు. వామనుడు గద్య పద్యాత్మకమైన కావ్యాన్ని నిబద్ధ, అనిబద్ధ కావ్యాలు అని, నన్నె చోడుడు కవిత్వాన్ని మార్గ, దేశి, అని రెండు విధాలుగా విభజించారు.

పాశ్చాత్యులు కవిత్వాన్ని ఆత్మాశ్రయ కవిత్వం, పరాశ్రయ కవిత్వం అని రెండు విధాలుగా వర్గీకరించారు.

ముఖ్యంగా ప్రాచీన సాహిత్యంలో కావ్య స్వరూపాన్ని బట్టి విభజించిన చంపూకావ్యం గురించి వివరించుకుందాం.

## విషయ వివరణ

చంపు లేదా చంపూ-కావ్యం అనేది భారతీయ సాహిత్యంలో సాహిత్య కూర్పు యొక్క ఒక శైలి. చంపు అనే పదానికి కవిత్వం మరియు గద్యాల కలయిక అని అర్థం.

వేద కాలం నాటి ఐతరేయ బ్రాహ్మణంలో హరిశ్చంద్రోపాఖ్యానం చంపూ-కావ్యానికి ఆధారం. చంపు-కావ్య 2వ శతాబ్దం ADలో, జునాగఢ్‌లోని రుద్రదమన్ శిలా శాసనంపై కనిపిస్తుంది. ఇది రామాయణం, మహాభారతం, పురాణాలు మరియు ఇతర మహాకావ్యాలలో కూడా కనిపిస్తుంది.

చంపూ కావ్యం
అనగా పద్యగద్య సమ్మిళితం.
అంటే పద్యం, గద్యం రెండూ కలిసి ఉంటాయి. దీనినే
గద్యపద్యోభయ కావ్యం అంటారు.

పద్య కావ్యం
'పద్యం చతుష్పదమ్'
నాలుగు పాదాల్లో రాయబడేది పద్యం. ఈ పద్య కావ్యం
చందోబద్ధమైనది.

ఉదా: ఆంధ్ర మహాభారతం రామాయణం, నిర్వచనోత్తర రామాయణం మొదలైనవి.

గద్య కావ్యం

అపాద: పద సంఘాత: గద్యం', పాద నియమం లేని పదాల సముదాయం గద్యం ఉదా: దండి – దశకుమార చరిత్ర, బాణుడు – కాదంబరి,

సముఖం వేంకట కృష్ణప్ప నాయకుడు జైమిని భారతం మొదలైనవి. ఆధునిక తెలుగు సాహిత్యంలో వచ్చిన ప్రక్రియలన్నీ గద్యాత్మకాలే అనగా వచన ప్రక్రియకి సంబంధించినవే.

ఈ రెండు లక్షణాలతో కలిసి ఉండేదే చంపూ కావ్యం.

మన తెలుగు సాహిత్యాన్ని పరిశీలించినట్లయితే క్రీస్తు శకం 11వ శతాబ్ది నుంచి లిఖితపూర్వకమైన ఆధారాలను బట్టి నన్నయ రచించిన ఆంధ్ర మహాభారతం మొదటి కావ్యంగా, నన్నయను ఆది కవిగా సాహిత్య విమర్శ కారులు పరిగణిస్తున్నారు.

నన్నయ వ్యాసభారతాన్ని చంపూ కావ్య పద్ధతిలోనే ఆంధ్రీకరించాడు.

అయితే నన్నయకు పూర్వమే తెలుగు భాషకు సంబంధించిన గద్య, పద్యాలు ఉన్నట్లు శాసన ఆధారాల ద్వారా తెలుస్తున్నాయి.

క్రీ.శ. 8వ శతాబ్ది వరకు గల శాసనాలలో తెలుగులో గద్య రచన కనబడినా అక్కడక్కడ గేయ లక్షణాలు గల వచనం కూడా వుండేది. తూర్పుచాళుక్య రాజైన విజయాదిత్యుని కాలం నుంచి ఛందస్సుతో నిండిన శాసనాలు కనబడతాయి. క్రీ.శ. 848 నాటి పండరంగని అద్దంకి శాసనంలో "పట్టంబుగట్టిన ప్రథమంబు నేడు బలరవం బొప్పగ బైలేచిసేన పట్టంబు గట్టించి....." అనే తరువోజ పద్యం వుంది. ఇదే తొలి పద్యంగా భావిస్తారు. ఈ పద్యం తర్వాత "పాండురంగ పరమ మహేశ్వరణు ఆదిత్యభట్టారనికి ఇచ్చిన......" అనే వచనం వుంది. అంటే ఈ విధమైన పద్య గద్యాత్మకమైన 'చంపూ' పద్ధతి అప్పటికే వుందన్నమాట. గుణగ విజయాదిత్యుని కాలం నాటి శాసనాలలో సీసపద్యా లున్నాయి. యుద్ధమల్లుని బెజవాడ శాసనం (885 ప్రాంతం)లో అయిదు 'మధ్యాక్కర' పద్యాలు కనిపించాయి. సాతలూరు శాసనంలో చంపకమాల పద్యం ఉంది. క్రీ.శ. 1000 నాటి విరియాల కామసాని గూడూరు శాసనంలో మూడు 'చంపకమాల' పద్యాలు, రెండు 'ఉత్పలమాల' పద్యాలు కనిపిస్తాయి. ఈ పద్యాలు నన్నయ పద్యాలను తలపిస్తాయని పరిశీలకుల అభిప్రాయం.

"శ్రీ విక్రమాదిత్య నృపాగ్రతనయుండైన చాళుక్యభీమునకు శౌచ కందర్పునకు వేగేశ్వరునకు రణమద్దాన్వయకుల తిలకుండైన కుసుమాయుధుండు గన్నరబ్లహనికి సప్రాప్తంబైన" వంటి గద్య రచన నన్నయకు ముందు శాసనాలలో వుంది.

చంపూ కావ్య పద్ధతికి ఉదాహరణగా కవిత్రయ ఆంధ్ర మహాభారతంలో కొన్ని గద్య పద్యాలను పరిశీలిద్దాం.

ముందుగా నన్నయ్య మహాభారతంలోని గద్య పద్యాలను ఉదాహరణలుగా పరిశీలిద్దాం.

సభాపర్వంలో ద్రౌపదీ వస్త్రాపరహణ సందర్భంలో దుశ్శాసనుని పై భీముడు కోపోద్రిక్తు డయ్యాడు. ఆ కోపాన్ని నన్నయ వీరరస సూర్తితో తన అక్షర రమ్యతను జోడించి ఇలా మత్తేభ వృత్తాన్ని రచించాడు.

"కురువృద్ధుల్ గురువృద్ధబాంధవులనేకుల్ సూచుచుండన్ మదో
ద్ధరుడై ద్రౌపదినిట్లు సేసినఖలున్, దుశ్శాసనున్ లోకధీ
కర లీలన్ వధియించి తద్విపుల వక్ష శ్శైలరక్తాఘని
ర్ఝరముర్వీపతి సూచుచుండనని నాస్వాదింతునుగ్రాకృతిన్"

నన్నయ కొన్ని వ్యాకరణ రూపాలను తీర్చిదిద్దటం వల్ల సంస్కృత వృత్తాలకు యతిప్రాసలు చేర్చటం వల్ల కూడా అక్షరరమ్యత సాధించాడని అంటారు.

సంస్కృతంలో "గద్యం కవీనాం నికషం వదంతి" కవులకి గద్య రచన గీటురాయి వంటిదన్న సూక్తి వుంది. అందువల్ల గద్యానికి ప్రాముఖ్యం ఉందని తెలుస్తోంది. తిక్కన "పద్యములు గద్యములన్ రచియించెద" అనటంలో గద్యమంటే వచనమని తెలుస్తుంది. నన్నయ భారతంలో కూడా వచనముగా 'వ' అని సంకేతించబడింది. కాబట్టి తెలుగులో గద్య వచనాలు సమానార్థకాలుగా వాడబడ్డాయి.

నన్నయ భారతంలోని వచనం 'వృత్తగంధి' అనే లక్షణాన్ని కలిగి వుంటుంది. వచన రచన పద్యంలా సాగటమే వృత్తగంధి అనవచ్చు. "అక్కధకుండు శౌనకాది మహా మునులకుం జెప్పె నాదియుగంబున గశ్యప....", "ఇట్లు పెక్కు మృగంబుల నెగచి చంపెడు వేళ....." మొదలైనవి ఉదాహరణలు. ఈ రకంగా సీస పద్య పాదం లాగా, కంద పద్య గీత పద్య పాదాల లాగా వచనం రాయడం గమనిస్తాం.

నన్నయ్య సభాపర్వంలో నారదుడు ధర్మరాజుకు రాజనీతిని ప్రబోధించే సందర్భంలో రాజు

పరిహరించాల్సిన 14 రాజదోషాలను ఈ వచనంలో చక్కగా వివరించాడు.
వ. మఱియు నాస్తిక్యం, బనృతంబు, ప్రమాదం, బాలస్యం, బనర్థజ్ఞులతోడి చింతనంబు, క్రోధంబు, దీర్ఘచింత, దీర్ఘసూత్రత, యెఱుకగలవారి నెఱుంగమి, యర్థంబులయం దనర్థకచింత, నిశ్చితకార్యంబులు సేయమి, మంత్రంబుల రక్షింపమి, శుభంబులఁ బ్రయోగింపమి, విషయంబులం దగులుట యనం బరఁగిన పదునాలుగు రాజదోషంబులఁ బరిహరింతె యని యడిగిన నారదునకు ధర్మరా జిట్లనియె.
ఈ పద్య గద్యాలు నన్నయ భారతానికి ఉదాహరణ అయితే తిక్కన భారతానికి ఉదాహరణగా విరాటపర్వంలో పాండవులు ద్రౌపది విరాటని కొలువులో ఏ విధంగా మసులుకోవాలో వాళ్ళ పురోహితుడైన ధౌమ్యుడు చెప్పే సందర్భంలోనివి ఈ క్రింది తిక్కన్నకిష్టమైన కందపద్యము వచనములను పరిశీలించవచ్చు.

క. వాలి వివిధాస్త్ర విద్యా
జ్వాలల వెలుఁగొందుపాండవజ్వలనం బా
లీలత మండం దొడరినఁ
గాలవిరోధంబు మఱచి కార్యముఁ దప్పున్.

వ. కావున మీకు నప్రమాదార్థంబుగా నానేర్చినవిధంబున నుపదేశం బవశ్య కర్తవ్యంబు రాజులం గొలిచి యెమ్మెయి నయినను బ్రదుకుజనంబులు కీడునుం బొరయ కుండునట్టి సాధారణనీతి సంక్షేపరూపంబున నెఱింగించెద సావధానుల రయి వినుండు.
కవిత్రయముల మూడోవాడైన ఎర్రన్న గారి మహాభారత అరణ్యపర్వములోని సావిత్ర్యుపాఖ్యానము గద్యపద్యములలో మనోజ్ఞనముగా రచింపబడిన ఒక చిన్న ప్రబంధము. సావిత్రి యముని కోరిన వరము వలన ఆంధ్రుడైన అశ్వపతికి కన్నులు వచ్చి చుట్టూ కలయజూడగా కుమారుడు కన్పించడు. అపుడు ఆ వృద్ధుడు పొందే ఆ వేదనను ఎర్రన తన సూక్తి వైచిత్రితో ఎలా వ్యక్తపరచినాడో పరిశీలించవచ్చు.
కన్నులు వచ్చి యెల్లెడలుఁ గట్టిని వృద్ధవరేంద్రుఁ దాత్మకుం
గన్నులుఁ బోలెవైన తనగాదిలి పుత్రుఁడు గావవంబులో
నెన్నఁడు లేనియంత తడవేటికిఁ జెక్కెనో యంచు వార్తితోఁ
గన్నులు లేని యట్లొకఁడుఁ గానక యేడ్చె సతీసమేతుఁడై.
ఈ విధముగా చంపూ కావ్య పద్ధతికి ఉదాహరణగా కవిత్రయ ఆంధ్ర మహాభారతాన్ని పరిశీలించవచ్చు.
ఇప్పుడు రామాయణాలలో చంపు కావ్య పద్ధతికి మొల్ల రామాయణంలోని పద్య గద్యాలను పరిశీలిద్దాం.
ఆ పరమ పావని అయిన సీతాదేవి అశోకవనంలో ఉండగా అక్కడ ఆమెకు కాపలాగా ఉన్న త్రిజట అనే రాక్షస స్త్రీ ఒక కల గంటుంది. ఆ కలలో శ్రీరామచంద్రుడు వచ్చి సీతాదేవిని తీసుకువెళ్తాడని అందుకుగాను సీతాదేవిని మనం ఎవరమూ మాటల చేతగాని చేతల చేతగాని గాని బాధించకూడదని, ఆమెను రక్షించుకుంటేనే మనకు దిక్కు ఉంటుందని చెప్తుంది. అంతేకాక తన కల తెల్లవారుజామున వచ్చింది కాబట్టి ఖచ్చితంగా నిజం అవుతుందని అక్కడ ఉన్న వాళ్ళతో చెప్పే సందర్భంలోనివి.
వ. అప్పుడు యామినీచరకామినులు రావణానుమతంబున ననేక విధంబు లగు మధురాలాపంబుల మిథిలాధీశుకుమారిం గుఱించి బోధించి, కార్యంబు సాధింప నోపక యలసియుంటం జేసి యొక్కింతసేపు నిద్రించుచుండ మేల్కొని త్రిజట యను నిశాచరి యిట్లనియె.
మ.
కలగంటిన్ వినుఁ డింతులార మనలంకాద్వీప మీయబ్ధిలో పల వ్రాలన్ మన రావణేశ్వరుని శుంభద్రత్నకోటీరముల్ కలనన్ గూల రఘూద్వహుండెలమితో గంధద్విపంబెక్కి యు జ్వలకాంతిన్ విలసిల్లుసీతఁ గొనిపోవన్ మిన్న కే నిప్పుడే,
క. శుద్ధాత్ముఁ డైనరాముఁడు శుద్ధాంతపుదేవిఁ గాన శుభసూచకముల్ శుద్ధ మయి తోఁచుచున్నవి సిద్ధం బీమాట వేదసిద్ధాంతముగాన్,
క. కావున నిక్కోమలియెడఁ గావలి యున్నట్టి మీరు కఠినోక్తులు గా నేవియు నాడకుఁ డిఁక నీ దేవియ రక్షింప మనకు దిక్కగు మీఁదన్.

## ముగింపు

పై విధముగా చంపూ-కావ్య పద్ధతికి ఉదాహరణముగా కవిత్రయ ఆంధ్ర మహాభారతాన్ని, మొల్ల రామాయణంలోని కొన్ని పద్య, గద్యాలను పరిశీలించడమైనది.

## ఆధార గ్రంథాలు


1. తెలుగు సాహిత్య సమీక్ష – G. నాగయ్య
2. తెలుగు సాహిత్య చరిత్ర – డాక్టర్ ద్వానా శాస్త్రి
3. తెలుగు సాహిత్య విమర్శ సిద్ధాంతములు-ప్రొఫెసర్ వెలమల సిమ్మన్న
4. కవిత్రయ విరచిత శ్రీ మదాంధ్ర మహాభారతము – తిరుమల తిరుపతి దేవస్థానములు ప్రచురణ.-డా. జి.వి. సుబ్రహ్మణ్యం సంపాదకత్వం
5. మొల్ల రామాయణము-మొల్ల, వావిళ్ళ ప్రచురణ.